రామగుండం అభివృద్ధికి సహకరించాలి 8లో..

గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పర్యటన 8లో..



మరోసారి తెరపైకి ఎమ్మెల్సీ 'తానిపర్తి'

- ఐదుగురు ఎమ్మెల్సీలతో కలిసి కాంగ్రెస్‌లో చేరిక
- నాడు బీఆర్ఎస్ కోసం.. నేడు కాంగ్రెస్ కోసం..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద రావు పేరు మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీకి శాసన మండలిలో తగిన బలం లేదు. ప్రభుత్వం ప్రవేశపెట్టే కీలక బిల్లులు కూడా మండలిలో నెగ్గాలంటే అక్కడ సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ ఆకర్ష్‌కు కేసీఆర్ తెర లేపగా, అప్పటికే స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన తానిపర్తి భానుప్రసాదరావుపై దృష్టి సారించారు. ఆయన సహాయంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన మెజారిటీ శాసన మండలి సభ్యులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు అదే సీన్ రిపీట్ అవుతున్నది. గత ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చింది. కానీ శాసన మండలిలో తగినంత మంది సభ్యులు లేకపోవడం ఆ పార్టీకి విఘాతంగా మారింది. కీలకమైన బిల్లులు ప్రవేశ పెట్టినప్పుడు శాసన మండలిలో సంఖ్యా బలం లేనందున వీగిపోయే అవకాశాలున్నాయని భావించిన కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలపై గురిపెట్టింది. ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపింది. అనూహ్యంగా గురువారం అర్ధరాత్రి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావుతో పాటు దండే విఠల్, దయానంద్, ప్రభాకర్‌రావు, ఎగ్గే మల్లేశం, బస్వరాజు సారయ్యలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు భానుప్రసాదరావు కీలకంగా వ్యవహరించినట్లు ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ అరంగేట్రం చేసిన భానుప్రసాద రావు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడంతో ఆయన వర్గీయులు ఆనందాన్ని వెలిబుచ్చుతున్నారు.

● కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి..

ఎలిగేడు మండలం లోకపేట గ్రామానికి చెందిన భానుప్రసాదరావు 2009లో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. అదే ఏడాది జరిగిన కరీంనగర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఏకగ్రీవంగా గెలుపొందారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరిన ఆయన 2016లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2021 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన రాజీవ్ రహదారి హౌస్ కమిటీ చైర్మన్‌గా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, మైనార్టీ వెల్ఫేర్ కమిటీ మెంబర్‌గా, ప్రభుత్వ హామీలు, గ్రంథాలయ కమిటీ మెంబర్‌గా పనిచేయగా, 2019లో ప్రభుత్వ విప్‌గా, 2023 ఫిబ్రవరిలో చీఫ్ విప్ పదవులను చేపట్టారు. ఆయన రెండు దఫాలుగా పార్టీ మారినప్పుడు సంచలనం సృష్టించారు. ఆయా పార్టీలకు ఆయన కీలకంగా మారారు. భానుప్రసాదరావు కాంగ్రెస్‌లో చేరడంతో పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఆ పార్టీ మరింత బలోపేతం కానున్నది. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన అనుచరులు సైతం త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఆషాడ మాసం ముగిసిన తర్వాత వారంతా కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నద్ధం అవుతున్నారు. కీలక సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరి ఆపన్న హస్తం అందించిన భానుప్రసాదరావుకు మండలి చైర్మన్ పదవి గానీ, ప్రభుత్వ చీఫ్ విప్ పదవి గానీ దక్కే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతున్నది.

విద్యార్థి నాయకుల అరెస్టు అక్రమం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్

గోదావరిఖని, జూలై 5: నిరుద్యోగులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోగా, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని పోరాటాలకు సిద్ధమైన విద్యార్థి సంఘాల నాయకులను అక్రమ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని చందర్ ఖండించారు. నక్సలైట్ల కంటే దారుణంగా అర్ధరాత్రి పడుకున్న వారిని పట్టుకొచ్చి పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించడం ప్రజాపాలనకు నిదర్శనమా అని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజా పాలన కాకుండా నిర్బంధ అరాచక పాలక కొనసాగుతుందన్నారు. విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ జాబ్ క్యాలెండర్‌ను వెంటనే ప్రకటించాలని చందర్ డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

పెద్దపల్లి టౌన్, జూలై 5: నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన టీజీపీఎస్సీ ముట్టడి కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలుపగా, పెద్దపల్లి పట్టణ నాయకులను గురువారం రాత్రి ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పురాజ్ కుమార్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అనేక అబద్ధాలను ప్రచారం చేసింది, అంతేగాక నిరుద్యోగులకు గ్రూప్ పోస్టుల సంఖ్య పెంచుతామని, గ్రూప్ వన్ మెయిన్స్‌కు 1:10 నిష్పత్తి పాటిస్తామని జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని మెగా డీఎస్సీ ఇస్తామని జీవో 46 రద్దు చేస్తామని నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేస్తామని అనేక హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందో వాటిని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు నిరుద్యోగ యువత పోరుబాట పట్టిందో దానికి పూర్తిస్థాయిలో టిఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఏకంగా టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తే ఆనాడు ప్రజాపాలన ధర్నా చౌకులను ఎత్తివేస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఈనాడు ముందస్తు అరెస్టులు చేస్తూ నిర్బంధాలను కొనసాగిస్తుందని పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో కర్రె దేవేందర్‌రెడ్డి, ఈదునూరి ప్రేమ్‌కుమార్, తదితరులున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు దాసరి ఉషను హౌస్ అరెస్టు చేయగా ఆమె ఇంట్లోనే నిరసన దీక్ష చేపట్టారు. ఆమెకు బొంకూరి సన్నీ, తదితరులు సంఘీభావం ప్రకటించారు.

విపక్ష పార్టీల నాయకుల అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 5: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కార్యాలయ ముట్టడికి నిరుద్యోగ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు పలువురు ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్టు చేశారు. బీఆర్ఎస్, బీజేవైఎం, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మేడి సదానందం, పులి రాకేష్, వాజిద్, దేవేందర్, గుడెల్లి రాంచందర్‌లను అరెస్టు చేశారు.

మంథని డివిజనల్ పంచాయతీ అధికారి సరెండర్

పెద్దపల్లి, మంథని జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మంథని డివిజనల్ పంచాయతీ అధికారి ఎ శంకర్‌ను కమిషనర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, హైదరాబాద్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సేవలు సంతృప్తికరంగా లేవని భావించిన కలెక్టర్ ఆయనను సరెండర్ చేసి పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి వి వేణుగోపాల్‌ను ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు.

ఇసుక రీచ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మంథనిరూరల్, జూలై 5: ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని విలోచవరం గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను ఆయన శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణంతో పాటు ఇతర పనులకు అవసరమయ్యే ఇసుకను ప్రజలు ఇసుక రీచ్ ద్వారా తీసుకోవాలన్నారు. ఇసుక రీచ్‌ల నుంచి కాకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ రవితో పాటు తదితరులున్నారు.

మానవాళి మనుగడకు మొక్కలు నాటాలి

- బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య



మొక్కలు నాటుతున్న సోమారపు లావణ్య

కళ్యాణ్‌నగర్, జూలై 5: మానవాళి మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ మహిళా మోర్చ కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య పిలుపునిచ్చారు. భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గౌతమినగర్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు, వాయు కాలుష్యాన్ని తగ్గంచడానికి మొక్కలను నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, 50శాతం అడవులు అభివృద్ధి చెందితేనే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతావనిఇ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాళ్లు శిరీష, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పులో భాగంగా నిర్మాణాల తొలగింపు

- దశల వారీగా క్వార్టర్లను ఖాళీ చేస్తున్న కార్మికులు



షెడ్డును తొలగిస్తున్న సింగరేణి అధికారులు

కోల్‌సిటీ, జూలై 5: రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వ్యాపార కేంద్రానికి అప్రోచ్ రహదారుల విస్తరణ, నూతన రహదారుల నిర్మాణంలో భాగంగా సింగరేణి సంస్థకు చెందిన ఖాళీ క్వార్టర్లను, నిర్మాణాలను యాజమాన్యం తొలగిస్తోంది. ఇప్పటికే పలు ఖాళీ క్వార్టర్లను తొలగించిన సింగరేణి శుక్రవారం మెయిన్ చౌరస్తా సమీపంలోని శివాజీనగర్ రహదారి షాపుల వెనుక ఖాళీ అయిన కట్టడాలను తొలగించింది. ఇప్పటి పలువురు రిటైర్డ్ కార్మికులు స్వచ్ఛందంగా క్వార్టర్లను అప్పగిస్తున్నారు. కాగా క్వార్టర్ల పక్కన గతంలో క్వార్టర్లను పొందిన వారు నిర్మించిన అద్దెలకు ఇచ్చిన షాపుల్లో కిరాయి ఉంటున్నవారు కూడా తమకు భారీగా కిరాయిలు లేకుండా సింగరేణి, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో షాపులు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు. మరో వైపులక్ష్మీనగర్ అభివృద్ధికి రూ.35కోట్లు టీయూఎఫ్ఐడీసీ నిధులతో ప్రజారోగ్య శాఖ టెండర్లను పిలిచింది. ఈ నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అండర్‌గ్రౌండ్ విద్యుత్‌వైర్లు, ఆధునిక వీధిదీపాలు, సీసీరోడ్లు నిర్మాణం చేయనున్నారు. వ్యాపార కేంద్రానికి మెయిన్ చౌరస్తా నుంచి ఓల్డ్ అశోక థియేటర్, అశోక్‌నగర్ వైపు నుంచి రహదారి విస్తరించి అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి నగరపాలక సంస్థకు చెందిన టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలు ప్రణాళికలు చేస్తున్నారు. టెండర్లు పూర్తికాగానే పనులు మొదలుపెట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమసురేష్‌రెడ్డి



కుండిలో నీటి తొలగిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

మంథని, జూలై 5: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకన్న డ్రై కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మందాట, పద్మశాలి వీధి, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కూలర్లలో, పూలకుండీ మొక్కల్లో ఉన్న నీటిని తొలగించారు. నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారి చేయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రమ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు వ్యక్తి గత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రావన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులకు నాణ్యమైన పాలు, ఆహారాన్ని పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గుట్టల మల్లికార్జునస్వామి, వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చైరపర్సన్, కౌన్సిలర్లు..

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక క్రీడా మైదానంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల బాగు కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు కొట్టే పద్మ-రమేష్, వీకే రవి, గుండా విజయలక్ష్మి-పాపరావు, గట్టు రాధాకృష్ణలు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామికి రూ.4.23 లక్షల ఆదాయం

ఓదెల, జూలై 5 : భ్రమరాంభ మల్లికార్జునస్వామి క్షేత్రంలో పలు విక్రయాల హక్కు కోసం శుక్రవారం నిర్వహించిన ఆన్ సీజన్ వేలంపాట ద్వారా క్షేత్రానికి రూ.4.23 లక్షల మేరకు ఆదాయం సమకూరింది. అలాగే హోటల్ నిర్వహణ రూ.51 వేలు, మనియార్ రూ.81 వేలు, ఫోటోలు, పాత్రలు రూ.18వేలకు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. స్వీట్‌హౌజ్ రూ.73వేలు, గాజుల దుకాణం రూ.53వేలు, వాహన పార్కింగ్ రూ.లక్షా50 వేలకు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు.

ఆలయ భూముల కౌలు వేలం మళ్లీ వాయిదా

మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన దేవాలయ భూముల కౌలు వేలంపాట ఐదవసారి మళ్లీ వాయిదా పడింది. సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన వేలంపాటలో చీకటితోట ఆంజనేయస్వామి రూ. 50 వేలకు కౌలు వేలంలో రైతు దక్కించుకున్నట్లు ఈవో సదయ్య తెలిపారు. అలాగే సీతారామచంద్ర స్వామి భూముల కౌలు వేలంలో రైతులు ఎవరు ముందుకు రాకపోవడంతో కౌలు వేలం పాట మళ్లీ వాయిదా పడిందని ఈవో తెలిపారు.

రాజధానికి చేరిన క్వార్టర్ల కూల్చివేత రగడ

- ప్రజాభవన్ ఎదుట సింగరేణి బాధితుల నిరసన - సీఎండీ బలరాంకు మొరపెట్టుకున్న ఖని వాసులు



సింగరేణి భవన్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు



సీఎండీకి వివరిస్తున్న తోట వేణు

గోదావరిఖని, జూలై 5: గోదావరిఖని శివాజీనగర్-హనుమాన్ ప్రాంతాల్లోని సింగరేణి క్వార్టర్ల కూల్చివేత అంశం రాజధానికి చేరింది. పట్టణ సుందరీకరణ రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా ప్రధాన చౌరస్తా సమీపంలోని 82క్వార్టర్ల కూల్చివేతకు సంబంధించిన సింగరేణి చర్యలను వ్యతిరేకిస్తూ ఆ క్వార్టర్లలో నివాసముంటున్న సింగరణి కార్మిక కుటుంబాలు మూడు మాసాలుగా పోరాటాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ముఖ్యమంత్రిని కలిసేందుకు బాధితులు హైదరాబాద్ ప్రజా భవన్‌కు వెళ్లారు. అక్కడ సంబంధిత అధికారులకు సమస్యను వివరించి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా భవన్ ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం సింగరేణి భవన్‌కు వెళ్లి సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి క్వార్టర్ల కూల్చివేతను నిలిపివేయాలని కోరారు. కేవలం రామగుండం ఎమ్మెల్యే ఒక్కరి సూచనతో సింగరేణి యాజమాన్యం మొత్తం ఏకపక్షంగా కార్మికులకు వ్యతిరేకంగా, వాళ్ల నివాసముండే క్వార్టర్లను కూల్చివేయడం హేతుబద్ధమైంది కాదని బాధితులు వివరించారు. రోడ్డు వెడల్పు పేర జరుగుతున్న ఈ విధ్వంసాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు వెడల్పు పేర ఒకేవైపు మూడులైన్ల క్వార్టర్లను కూల్చివేస్తూ పట్టణంలో ప్రధాన కేంద్ర చౌరస్తాలో ఈ భూమిని అన్యాక్రాంతం చేసేందుకు జరుగుతున్న కుట్రను అర్థం చేసుకోవాలని సీఎండీకి వివరించారు. రోడ్డు వెడల్పు కోసం ఒక లైన్ క్వార్టర్లు 12 తొలగిస్తే సరిపోతుందని, మూడు లైన్ల క్వార్టర్ల తొలగించడం నిష్ఫలమైందని, దీని వెనుక కుట్ర ఉన్నదని ప్రభుత్వం దృష్టికి, సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ఒకేవైపు రోడ్డు వెడల్పు చేయడం కూడా అసహజ చర్య అని వివరించారు. ఒక ఎమ్మెల్యే ప్రతిపాదనను సింగరేణి యాజమాన్యం అంగీకరించడం సహేతుకం కాదని వారు వివరించారు. సింగరేణి డిపెండెంట్ క్వార్టర్లు మార్చడం తగదని, ఇందులో 23మంది ఎస్సీ కుటుంబాలు జాతీయ ఎస్సీ కమిషన్‌కు మొరపెట్టుకున్న విషయం కూడా ప్రభుత్వానికి, సీఎండీకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో తోట వేణుతో పాటు సుమారు 60మంది బాధితులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడించిన ఏఐటీయూసీ, వామపక్షాలు

- బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ, వామపక్షాలు

పెద్దపల్లి టౌన్, జూలై 5: సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ శుక్రవారం ఏఐటీయూసీ, వామపక్షాల నాయకులు కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, సీపీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కోట్ల రూపాయలు ఖర్చు చేసి గుర్తించిన నూతన బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి ఇవ్వకుండా వేలం ద్వారా ప్రైవేటుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలో ఉన్న బొగ్గు గనులను కోల్ ఇండియా, సింగరేణికి ఇవ్వకుండా వేలం ద్వారా ప్రైవేటు వారికి ఇచ్చేందుకు చర్యలు ప్రారంభించిందని వారు ఆరోపించారు. తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా నామినేషన్ పద్ధతిలో సింగరేణికి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చిన సందర్భంలో సింగరేణి ప్రైవేట్‌పరం చేయబోమని, కొత్త బొగ్గు గను లను సింగరేణి కేటాయిస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పారన్నా రు. వెంటనే వేలం ప్రక్రియను వాయిదా వేయాలని, తెలంగాణ ప్రాంత బొగ్గు గనుల మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని వేలాన్ని రద్దు చేయించాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా బొగ్గు గనుల వేలంకు వ్యతిరేకంగా ఈనెల 8 నుంచి 12వరకు సింగ రేణి వ్యాప్తంగా అన్ని జనరల్‌మేనేజర్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. జూలై 10న జనరల్ మేనేజర్ కార్యాలయాల వద్ద భారీఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17న హైదరాబాద్‌లో వేలం వేసే ఆఫీసు ఎదుట పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేసి, వేలం ప్రక్రియను అడ్డుకుంటామన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎర్రవెల్లి ముత్యంరావు, ఇఫ్టూ నాయకులు కే విశ్వనాథం, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ దుర్గయ్య, ఏఐటీయూసీ కదారి సునీల్, వైవీ రావు, ఎల్ ప్రకాష్, గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోచం, జిగురు రవి, ఎమ్మార్సీ రెడ్డి, కే కనకరాజ్, తాళ్లపెల్లి మల్లయ్య, కోడం స్వామి, కుమారస్వామి, సీపీఎం నాయకుడు సీపెల్లి రవీందర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వేల్పుల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

వంతెన గర్డర్లు కూలిన బాధ్యత ఎమ్మెల్యేదే..

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



కూలిన వంతెన వద్ద విలేకరులతో మాట్లాడుతున్న పుట్ట మధు

ముత్తారం, జూలై 5: మండలంలోని ఓడెడ్ వంతెన గర్డర్‌లు కూలిన బాధ్యత మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుదేనని మాజీ ఎమ్మెల్యే, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. శుక్రవారం కూలిన వంతెన వద్ద పరిశీలించి విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎలక్షన్ సమయంలో ముత్తారం మండలం ఓడేడ్ మానేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి మూడు గర్డర్లు గాలికి కూలిపోతే పరిశీలించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తగిన చర్యలు తీసుకోకుండా అజాగ్రత్తగా వ్యవహరించడం మూలంగానే ప్రస్తుతం మళ్లీ ఐదు గర్డర్లు కూలిపోయాయని ఆరోపించారు. ఆనాడు కూలిన గర్డర్లను పరిశీలించిన ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణంలో అవినీతి జరిగిందని, మొత్తం బయటకు తీస్తానంటూ మాట్లాడాడని, మళ్లీ అటువైపు కన్నెత్తి చూడలేదన్నారు. ఆనాడే మూడు గర్డర్లు కూలిపోతే మిగితావి ఎలా ఉన్నాయని, వాటి పరిస్థితి ఏంటని పరిశీలన చేసి తదుపరి చర్యలు తీసుకుంటే ఈనాడు ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా దోచుకోవడంపై ఉన్న దృష్టి ప్రజాసమస్యలపై లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.50కోట్ల నిధులు తీసుకువచ్చామని, అయితే త్రీ పర్సంట్ లెస్‌తో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అలసత్వం వల్ల మధ్యలోనే పనులు ఆగిపోయాయన్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్‌బాబు ఓడేడ్ బ్రిడ్జి గురించి ఆలోచన చేయలేదని, కనీసం పర్యవేక్షణ చేయలేదన్నారు. ఇందుకు నైతిక బాధ్యత ఎమ్మెల్యే వహించాలన్నారు.



కాలుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- ఇబ్బందులు పడుతున్న రైతులు



మరమ్మతుల కోసం తెచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

గంగాధర, జూలై 5: వానాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతులకు కరెంటు కష్టాలు తప్పడం లేదు. తరచూ విద్యుత్ టాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో నారుమడులు తయారు చేసుకుంటున్న రైతులు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లతో మరమ్మతు కేంద్రాలకు పరుగెత్తుతున్నారు. గంగాధర మండలంలో ప్రధానంగా వ్యవసాయం బావులు, బోర్లకింద వరి, వివిధ పంటలు సాగుచేస్తారు. మండల వ్యాప్తంగా సుమారుగా 8,500 పైచిలుకు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. అయితే వీటికి వివిద స్థాయిలను బట్టి 16,25,63,100 కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు గంగాధర మండల వ్యాప్తంగా 475 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. విద్యుత్ శాఖ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా 4 శాతం ట్రాన్స్‌ఫార్మర్లు నిల్వ ఉంచుతారు. కాలిపోయిన సమయంలో దానిని మరమ్మతులు జరపడం సమయం పడుతున్నందున రిజర్వులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులకు అందిస్తారు. గంగాధరలో ఉన్న ట్రాన్స్‌పార్మర్ రిపేరు షెడ్డు ఈ సారి తట్టుకోలేక పోతుంది. ఇటీవల లక్ష్మీదేవిపల్లిలో ట్రాన్స్‌పార్మర్ కాలిపోగా గంగాధరలో లేకపోవడంతో రైతులు చొప్పదండి మండలం భూపాలపట్నం షెడ్డుకు 25 కిలోమీటర్ల దూరం నుంచి 10వేలు రవాణా ఖర్చులు పెట్టుకుని తెచ్చుకున్నారు.ఇప్పుడంతా లోటు కారణంగా వెంటనే ట్రాన్స్‌పార్మర్లు ఇవ్వలేక పోతున్నామని విద్యుత్ అధికారులు అంటున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నెల రోజుల్లో 475..

తరచూ కాలిపోతున్న ట్రాన్స్‌పార్మర్లపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క నెలలోనే 475 కాలిపోయాయంటే రిపేర్‌లోపమా, లోవోల్టేజీ సమస్య అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రిపేర్ షెడ్డుకు వచ్చిన రెండు రోజుల్లోనే ట్రాన్స్‌పార్మర్లను రైతులకందించాల్సి ఉండగా ఈ సారి ఎక్కువగా కాలిపోవడంతో సాధ్యపడలేదని సిబ్బంది తెలుపుతున్నారు. దీనిపై కాలిదాస్,డీఈ(ఎంఆర్‌టీ)ని వివరణ కోరగా 80 శాతం లూజువైర్ల కారణంగా ట్రాన్షపార్మర్లు కాలిపోతు న్నాయన్నారు. గాలి ఎక్కువగా వీయడం వల్ల వైర్లు ఒకదానికొకటి తాకి ట్రాన్స్‌పార్మర్లు కాలిపోతున్నాయన్నారు.

● రైతులపైనే రవాణా భారం

సీజన్‌లో కురుస్తున్న వర్షాలకు కరెంటు సమస్యలు ఎక్కువయ్యాయి. పలు సమస్యలతో ప్రతిసారి ట్రాన్స్‌పార్మర్లు కాలిపోయిన సమయంలో రైతులపైనే భారం పడుతోంది. కాలిపోయిన ట్రాన్స్‌పార్మర్‌ను ఆటో, ట్రాక్టర్ కిరాయికి తీసుకుని రిపేరు షెడ్డుకు పోవాల్సిందే. ప్రత్యేకంగా రిపేరు షెడ్డుకు వెల్లాల్సిన సమయంలో ట్రాన్స్‌పార్మర్ వినియోగిస్తున్న రైతులకు6 నుంచి 10 వేల ఖర్చు అవుతోంది.



నాణ్యత ప్రమాణాలను పరీక్షిస్తున్న అధికారులు

గ్రోమోర్ షాపులో చోరీ


- రూ. 38,476 అపహరించిన దుండగులు
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్

శంకరపట్నం, జూలై 5: శంకరపట్నం మండలం కేశవపట్నంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిని అనుకొని ఉండే కోరమండల్ ఇంటర్నేషనల్ మన గ్రోమోర్ ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో చోరీ జరిగింది. షాపు మేనేజర్ రాయిని సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రోమోర్ షాపులో గురువారం రాత్రి షాపుకు తాళం వేసి ఎవరింటికి వారు వెళ్లిపోయారు. శుక్రవారం ఎరువుల దుకాణం వద్దకు వచ్చి చూసేసరికి షటర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. వెంటనే కేశవపట్నం పోలీసులకు సమాచారం అందించారు. కేశవపట్నం పోలీసులు క్లూస్ టీమ్‌కు సమాచారం అందించగా, వారు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించారు. గురువారం ఎరువులు, పురుగుల మందులు అమ్మగా వచ్చిన రూ. 38,476 నగదు లాకర్‌లో ఉంచారు. రూ. 46,717 విలువ చేసే క్రిమిసంహారక మందులను దొంగలు దోచుకెళ్లారు. దు కాణంలో దాచిన లాకర్‌ను దుకాణం సమీపంలోని పొలాల వద్దకు ఎత్తుకెళ్లిన దుండగులు పగలగొట్టి అందులో దాచిన రూ. 38,476 నగదును దోచుకెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్లో చోరీపై ఫిర్యాదు చేసినట్లు సతీష్ తెలిపారు.

బాలిక ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

చందుర్తి, జూలై 5: చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం బండపల్లి గ్రామంలో కుమ్మరి శ్రీవాణి అనే బాలికను ఇంటి నిర్మాణం విషయంలో బాబు, చిరంజీవి, రవి వ్యక్తులు వేధింపులు చేయడంతో ఈ నెల 1న ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 3న మృతి చెందింది. ఈ సంఘటనపై తల్లి లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాబు, చిరంజీవి, రవిలపై కేసు నమోదు కాగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.





అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

మెట్‌పల్లి రూరల్, జూలై 5: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించిన నిల్వ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని రామలచ్చక్కపేట గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుకను మెట్‌పల్లికి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు తెలిపారు. గ్రామ శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. ట్రాక్టర్లు స్వాధీ నం చేసుకొని యజమానులపై కేసు నమోదు చేశామని వివరించారు.. అవసరమైన వారు అనుమతులు తీసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో బాలిక ఆత్మహత్య

చందుర్తి, జూలై 5: చందుర్తి మండలం కొత్తపేట గ్రామంలో అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ బాలిక శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం ఊరడి వెంకటి - పుష్ప దంపతుల కుమార్తె మహేశ్వరి(16) 15 రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. చికిత్స తీసుకున్నప్పటికీ నయం కాకపోవడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌండ్ పొల్యూషన్‌పై కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూలై 5: కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు కరీంనగర్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి సౌండ్ పొల్యూషన్‌కు కారణమైన వాహనాలపై కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ధ్వని కాలుష్యానికి కారణమైన జిల్లెల్లకు చెందిన మణివర్ధన్ కేటీఎం మోటార్ సైకిల్, కామెల్లి శ్రావణ్‌కు చెందిన రాయల్ యన్‌ఫీల్డ్ బైక్, బోద అంజికి చెందినా రాయల్ యన్‌ఫీల్డ్ వాహనాలు స్వాధీనం చేసుకొని కొత్త న్యాయ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్ తెలిపారు. వాహనాలకు సైలెన్సర్‌లు మార్చి ధ్వని కాలుష్యానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాదకరంగా మూలమలుపు



చిన్నముల్కనూర్ నుంచి పీచుపల్లికి వెళ్లే రోడ్డు మూలమలుపు

చిగురుమామిడి, జూలై 5: మండలంలోని చిన్నముల్కనూర్ నుంచి పీచుపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో గ్రామం చివరన ఉన్న ములమలుపు ప్రమాదకరంగా మారిందని రెండు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వారు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.





ప్రభుత్వ నిర్ణయంతో ఒక్కటైన కుటుంబం

● తల్లి మృతి.. జైలులో తండ్రి ● 14ఏళ్లుగా అనాథాశ్రమంలో పిల్లలు

● ఖైదీల విడుదలతో పిల్లల చెంతకు చేరిన తండ్రి



తండ్రికి పిల్లలను అప్పగిస్తున్న స్పందన నిర్వాహకుడు వీరస్వామి

జమ్మికుంట రూరల్, జూలై 5: సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ఆ కుటుంబంలో కొత్త కాంతులను నింపింది. తల్లిదండ్రుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో తల్లి మృతి చెందింది. ఇందుకు కారకుడని తండ్రిపై కేసు నమోదు కావడంతో కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. దీనితో వారి పిల్లలు ఒంటరి వారయ్యారు. ఆలనా పాలనా చూసే వారు కరువవ్వడంతో ఇద్దరు పిల్లలు పద్నాలుగేళ్లుగా అనాథాశ్రమంలోనే పెరిగారు. ఈ నెల 3న సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను ప్రభుత్వం విడుదల చేయగా పిల్లలు జైలునుంచి వచ్చిన తండ్రి చెంతకు చేరారు. వివరాలు ఇలా ఉన్నాయి.

జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామ సారయ్య క్షణికావేశంలో భార్య సత్తమ్మను నెట్టగా ప్రమాదవశాత్తు మరణించింది. ఈ సంఘటన 2010సంవత్సరంలో జరిగింది. న్యాయస్థానం సారయ్యకు యావజీవ శిక్ష విధించింది. అప్పుడు వారి కుమార్తె పూజకు 5సంవత్సరాలు, కుమారుడు బన్ని 4సంవత్సరాల వయస్సు. పిల్లలను పెంచేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పోలీసుల సహకారంతో కొత్తపల్లిలోని స్పందన అనాథాశ్రమంలో చేర్పించారు. అప్పటి నుంచి వారు ఆశ్రమంలోనే ఉంటూ ఇద్దరూ చదువుకుని పెద్దవారు అయ్యారు. ప్రస్తుతం పూజ డిగ్రీ ఫైనల్ ఇయర్, బన్ని ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఈ నెల 3న సత్ప్రవర్తన కింద ప్రభుత్వం సారయ్యను విడుదల చేసింది. ఆశ్రమంలోని పిల్లల వద్దకు వచ్చిన తండ్రి పిల్లలను చూసి ఉద్వేగానికి గురయ్యాడు. వారిని దగ్గరకు తీసుకుని కన్నీటి పర్యంతం అయ్యాడు. పూజ, బన్నిలను స్పందన ఆశ్రమ నిర్వాహకులు గోపరాజు వీరస్వామి తండ్రికి అప్పగించాడు.

బెట్టింగ్ యాప్స్ నిర్వాహకుల అరెస్ట్

- రూ.33 లక్షలు, కారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు

సుల్తానాబాద్, జూలై 5: బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తూ యువత నుంచి లక్షల రూపాయలను కొల్లగొడుతున్న ముఠాను సుల్తానాబాద్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి 33 లక్షల పది వేల రూపాయల నగదుతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమారు తెలిపిన వివరాల ప్రకారం.. సీపీ ఆదేశాల మేరకు పెద్దపల్లి డీసీపీ, ఏసీపీ, సుల్తానాబాద్ సీఐల పర్యవేక్షణలో సుల్తానాబాద్ ఎస్ఐలు శ్రావణ్‌కుమార్, నరేష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీలో భాగంగా ఓ కారును తనిఖీ చేయగా రూ.33 లక్షల నగదు పట్టుబడింది. కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ముల్కల రాజేశ్, చిన్నపల్లి అభిలాష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళంకు చెందిన నిమ్మల ధనుంజయ్‌లు ముఠాగా ఏర్పడి 55 క్లబ్, తిరంగా యాప్, 82 లాటరీ తదితర ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తూ యువకుల నుంచి లక్షలాది రూపాయలు లూటీ చేస్తున్నారు. బెట్టింగ్ యాప్‌ల ద్వారా వచ్చిన డబ్బులను తీసుకుని హైదరాబాద్ నుంచి గోదావరిఖని వస్తుండగా పోలీసులకు చిక్కారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్య

సుల్తానాబాద్, జూలై 5: సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కనుకయ్య(50) అనే రైతు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం పాల్పడ్డాడు. ఆరేళ్ల కనుకయ్య 34 గుంటల భూమిని కొనుగోలు చేయగా, లక్షల రూపాయల వరకు అప్పు అయ్యింది. రెండేళ్ల క్రితం కనుకయ్య చిన్న కుమారుడు రాజ్‌కుమార్‌కు యాక్సిడెంట్ కావడంతో చికిత్స కోసం మూడు లక్షల వరకు అప్పు అయ్యింది. మొత్తం నాలుగు లక్షల అప్పు కావడంతో అదే తీర్చేందుకు కనుకయ్య ప్రస్తుతం హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పు తీర్చలేననే బాధతో గురువారం పురుగుల మందు తాగగా, శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్ తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్ క్రైం, జూలై 5: కూతురుకు వివాహం జరగడం లేదని మనస్తాపంతో మద్యానికి బానిసగా మారి పురుగుల మందుతాగిన గణేశ్‌నగర్‌కు చెందిన తోట వెంకటేశ్వరరావు(55) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 25న ఇంటిలో మద్యంలో పురుగుల మందు కలిపి తాగగా కుటుంబసభ్యులు వెంకటేశ్వరరావును కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

సారంగాపూర్,జూలై, 5 : మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన పీసు ప్రవళిక(36) అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతూ గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల మేరకు ప్రవళికకు అదే గ్రామానికి చెందిన పీసు తిరుపతి రెడ్డితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే తిరుపతి రెడ్డి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నారు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి పడుకుంది. అందరూ నిద్రో ఉన్న సమయంలో ఇంట్లోనే ఉరివేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తల్లి బద్దం మాధవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలిక ప్రసవం

● ఓ యువకుడు మోసం చేశాడని తల్లి ఫిర్యాదు

● కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సైదాపూర్, జూలై 5: సైదాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) పెళ్లి కాకుండానే ప్రసవించి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. తల్లిదండ్రులకు వ్యవసాయ పనులకు చేదోడు వాదోడుగా ఉంటూ పనికి వెళ్తుండేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వరుసకు బావ అయ్యే యువకుడు(17) ఆమెపై అత్యాచారానికి పాల్పడంతో బాలిక గర్భం దాల్చింది. ఈ నెల 1న వరంగల్ ఎంజీఎంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బాలిక తల్లి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

ఎండపల్లి, జూలై 5: మండలంలోని గుళ్లకోట గ్రామంలో తాటి చెట్టుపై నుంచి కింద పడడంతో గీత కార్మికుడికి గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామంలో మూల లచ్చయ్య గౌడ్ గీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు లాగే శుక్రవారం కూడా తాటిచెట్టు ఎక్కాడు. పైకి ఎక్కాక మోకు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న గౌడ సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి సత్యం గౌడ్ చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించి జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

మహిళపై కోతుల దాడి

బీర్‌పూర్, జూలై 5: బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన మహిళపై శుక్రవారం కోతులు దాడి చేసి గాయపరిచాయి. బీర్‌పూర్ గ్రామానికి చెందిన చిర్నేని రఘునా అనే మహిళ తన ఇంటి వద్ద పనులు చేసుకుంటుండగా చెట్టుపైన ఉన్న కోతులు ఒకే సారిగా కిందకు దూకి దాడి చేసి గాయపరిచాయని బాధిత మహిళ తెలిపింది. కోతులతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఇంట్లో దూరి వంట సరుకులు చిందరవందరగా చేస్తూ ఇంటి పై కప్పులు తొలగిస్తున్నాయని వాపోయింది. అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

సిరిసిల్ల చేనేత అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

» హైదరాబాద్‌లో రూ. 100 కోట్లతో ప్రత్యేక మాల్ ఏర్పాటుకు యత్నం

» 35 మంది యువ పారిశ్రామికవేత్తలతో వెలిచాల రాజేందర్‌రావు భేటీ

» మిల్లుల ఆధునికీకరణ, ప్రింటింగ్, డైయింగ్ మిషన్‌లపై చర్చ



యువ పారిశ్రామికవేత్తలతో చర్చిస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్/సిరిసిల్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడం, చేనేత రంగ అభివృద్ధి కోసం విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేశామని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే విధంగా తాను కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన 35మంది చేనేత కుటుం బాలకు చెందిన యువ పారిశ్రామిక వేత్తలు శుక్రవారం వెలిచాల రాజేందర్‌రావును కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి లోతుగా చర్చించారు. వీరంతా ఇంజనీరింగ్, డిగ్రీ పూర్తి చేసిన యువ పారిశ్రామిక వేత్తలు. యువకుల ఆలోచనకు అనుగుణంగా నవతరం దృక్పథంతో నవీన పద్ధతుల్లో ముందుకు వెళ్లాలని ఆలోచనతో రాజేందర్‌రావును కలిసి వారి ఆలోచన లను తెలిపారు. వీరిలో 10 మంది 10 రోజులు తమిళనాడులో వస్త్ర పరిశ్రమలకు ప్రసి ద్ధిచెందిన తిర్పూర్, కోయంబత్తూర్, సేలం లాంటి పట్టణాలను సంద ర్శించి 10 రోజులు అక్కడే వస్త్ర పరిశ్రమ గురించి అవగాహన చేసుకున్నారు. వెలిచాల రాజేందర్‌రావు ఎన్నికల సమయంలో సిరిసిల్ల విజన్ డాక్యుమెంట్ తయారుచేసి, యువ పారిశ్రామికులతో రోడ్ మ్యాప్ కోసం వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ వచ్చే వారం సిరిసిల్లలో మరోసారి సమావేశమై దీనికి తుది రూపు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ తరువాత హైదరాబాద్లో టెక్స్‌టై ల్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, టెక్స్‌టైల్ కమిషనర్ అలుగు వర్షిణి, మంత్రి పొన్నం ప్రభాకర్, శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలువనున్నట్లు తెలిపారు. ఆ తరువాత వారంలో ముఖ్యమంత్రిని కలిసి సిరిసిల్ల చేనేత రంగం అభివృద్ధిపై విజన్ డాక్యుమెంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. దీంతో పాటే తాను తయారు చేసిన సిరిసిల్ల వీవర్స్ విజన్ డాక్యుమెంటును కూడా ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే విషయాన్ని సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు తెలిపారు. వస్త్రవిహార్ పేరుతో హైదరాబాద్‌లో ఒక ఆధునిక మాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం రూ. 100 కోట్ల క్యాపిటల్‌తో ముఖ్యమంత్రితో మాట్లాడతానని రాజేందర్‌రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు అందించి సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమకు వచ్చే స్కీములు, సబ్సిడీలు, గ్రాంట్లు ఇంట్రెస్ట్‌ఫ్రీ లోన్స్ సాధించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో గోవింద్ శ్రీకాంత్, దూడం శ్రీకాంత్, భానుచందర్, వంశీకృష్ణ, సతీష్, ప్రవీణ్, శ్రీరాం, భరత్, కోమాకుల మల్లికార్జున్, వేణుగోపాల్, దూస రమేష్, అడెపు వివేక్, గాజుల సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 5: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌లు శుక్రవారం పట్టుకున్నారు. గండ్రపల్లి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ధర్మారంలో తనుగుల కుఇసుక తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను కొత్తపల్లిలో అదుపులోకి తీసుకున్నారు. వాటికి ఎలాంటి అనుమతి పత్రాలు లేక పోవడంతో మల్లేష్, కుమార్, వెంకటేష్, శ్రీనివాస్, ధనుష్, అరవింద్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

వీణవంక: చల్లూరు గ్రామంలోని మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. డ్రైవర్ సాగర్, యజమాని ఉండాటి పోచయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూలై 5: శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో శుక్రవారం కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కారు ఢీ కొన్న ఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగట్టుకు చెందిన పల్లె రజిత బావి వద్దకు వెళ్లి వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి తిరి వస్తూ, తన భర్త మహేందర్‌రెడ్డి కోసం కరీంనగర్-వరంగల్ రహదారిపైన రోడ్డు పక్కకు నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హుజూరాబాద్‌కు వెళ్లే కారు రజితను ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయాల య్యాయి. రజిత అపస్మారక స్థితిలోకి చేరింది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందిస్తూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'నీట్'పై సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో శుక్రవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మతం ముసుగులో విచ్ఛిన్నకర శక్తులు కుట్రలు చేస్తున్నాయని వాస్తవాలను వక్రీకరించే విధంగా బీజేపీ ప్రచారం చేయడం దురదృష్టకరం అన్నారు. దేశంలో లక్షలాది మంది వైద్య విద్యార్థులకు చెందిన నీట్ పరీక్ష ప్రహసనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నీట్ పరీక్ష ఏ రాష్ట్రానికి సంబంధించి ఆ రాష్ట్రమే పరీక్ష నిర్వహణ చేసేదని, పారదర్శకత పేరుతో జాతీయస్థాయి పరీక్షగా మార్చి కేంద్రం గుత్తాధిపత్యం తీసుకుందని విమర్శించారు. నీట్ ఎంట్రెన్స్ పరీక్షను నిర్వహించలేని అసమర్థత ఎన్డీయే ప్రభుత్వానిదేనన్నారు. కేంద్రం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు, వాస్తవాలు బయటపడతాయనే ఉద్దేశ్యంతోనే తన పరిధిలో పనిచేసే సీబీఐకి కేసును అప్పగించిందని విమర్శించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సీబీఐతో కాకుండా సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రం వైఫల్యంతో విశ్వాసం సన్నగిల్లి అభద్రత భావన చోటుచేసుకుందన్నారు. పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పూర్తిగా విఫలమైందన్నారు. పరీక్ష లీకేజీపై ఆయా విద్యార్థి సంఘాలు దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిస్తే , దాని దృష్టిని మరల్చేందుకు రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై నిరసన తెలియజేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉపాధి కల్పించేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కార్యక్రమం ప్రవేశపెట్టిందని, దీంతో పాటు అవినీతి రహిత పాలన కోసం సమాచార హక్కు చట్టం, ప్రతి ఒక్కరికీ విద్యను అందించాలనే తలంపుతో విద్యాహక్కు చట్టం, నిరుపేదల కడుపు నింపేందుకు ఆహార భద్రత చట్టాన్ని అమలు చేసిందని, కానీ పదేళ్ల ఎన్డీయే పాలనలో నోట్ల రద్దు, జీఎస్టీ, నిత్యావసర ధరల పెంపు వంటి ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను గమనించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర బాధ్యులు బండ శంకర్, జిల్లా బాధ్యులు గిరి నాగభూషణం, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య, సీనియర్ నాయకులు రాధాకిషన్‌రావు, గుంటి జగదీశ్వర్, నెహాల్ బొల్లి శేఖర్ తదితరులున్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 5: గ్రామస్థాయిలో సీపీఐని బలోపేతం చేస్తూ స్థానిక ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయం బద్ధం ఎల్లారెడ్డి భవన్‌లో కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీపీఐ పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాల నిర్మాణం పటిష్టంగా ఉండేదన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, ఆయా జిల్లాల్లో పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసుకో వల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా సంఘాలు నిర్మాణాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రజాసంఘాల పునర్నిర్మాణం చేసుకుని కమిటీలు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేసినట్లయితే స్థానిక ఎన్నికల్లో గెలుపొందే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. సీపీఐ నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, గోశిక మోహన్, ఆయా జిల్లాలకు చెందిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విలేకరుల పేరిట వసూళ్లు.. ముగ్గురి రిమాండ్

వేములవాడ టౌన్, జూలై 5: విలకరుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డివిజన్ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన సిద్దయ్యకు 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 50 ఏళ్లుగా కాలువ నీటితో సాగు చేసుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన మల్లయ్య అనే వ్యక్తి కాలువను కూడిపి వేసి కింద ఉన్న వ్యవసాయ పొలాలకు సాగు నీరు వెళ్లకుండా చేశాడు. దీంతో కరుణాకర్, నరేష్, ప్రసాద్ అనే ముగ్గురు తాము విలేకరులమని, మల్లయ్యతో మాట్లాడుతామని అందుకు రూ.50 వేలు ఇవ్వాలని సిద్దయ్యను డిమాండ్ చేశారు. దీంతో సిద్దయ్య రూ.15 వేలు అందజేశాడు. కొద్ది రోజులకు మరిన్ని డబ్బులు ఇవ్వాలని అడుగగా సదరు రైతు నిరాకరించాడు. సదరు ముగ్గురు వ్యక్తులు మల్లయ్యతో చేరి సిద్దయ్య పొలానికి వెళ్లే రోడ్డును పూర్తిగా ధ్వంసం చేయించారు. దీంతో సిద్దయ్య కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 1,620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 11.44 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.265 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.330 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

299 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

మానకొండూర్, జూలై 5: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం మానకొండూర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి వరంగల్ నుంచి మహారాష్ట్రలోని నాందేడుకు తరలిస్తున్న 299 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారు. మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బియ్యం లభ్యం కావడంతో పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసి వరంగల్‌కు చెందిన డ్రైవర్ జమీల్, సయ్యద్ హైమద్, క్లీనర్ కుశాల్‌రావు, తడక సతీష్, జన్ను అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పెంపుడు జంతువులతో.. జాగ్రత్త



- వ్యాధులు సంక్రమించే ప్రమాదం
- అవగాహన కలిగి ఉండాలని నిపుణుల సూచన
- నేడు వరల్డ్ జూనోసిస్ డే


జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాలక్షేపం, సరదాగా పెంచుకునే జంతువుల నుంచి సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్‌గా పేర్కొంటారు. వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని నిపుణు లు చెబుతున్నారు. శనివారం వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

● రేబిస్ రాకుండా..

ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొదటి సారిగా 1885 జూలై 6వ తేదీన పిచ్చి కుక్క కాటుకు గురైన బాలుడికి నిరోధక టీకా ఇవ్వడం ద్వారా రేబిస్ వ్యాధి రాకుండా కాపాడగలిగాడు. దీంతో అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం జూలై 6వ తేదీన జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. పెం పుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.

● 200 రకాల వ్యాధులు..

శాస్త్రవేత్తలు, వైద్యుల అంచనాల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు దాదాపుగా 200 రకాల వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతు వుల వల్ల పిల్లలకు ముప్పు ఎక్కువగా ఉంటుంది. కరోనా వైరస్ గబ్బిలాల నుంచి వ్యాపించినట్లు పేర్కొన్నప్పటికీ పూర్తి స్థాయి నిర్ధారణ జరగలేదు. పందుల ద్వారా మెదడు వాపు వ్యాధి, కుక్కల ద్వారా రేబిస్, గొర్రెలు, మే కల ద్వారా అంత్రాక్స్, ఆవులు, గేదెల ద్వారా క్షయ, పాలద్వారా బ్రూసె ల్లోసిస్ తదితర వ్యాధులు వ్యాపిస్తాయని వైద్యులు అంటున్నాయి. వ్యాధు లు సోకిన కోళ్లు, గొర్రెలు, జంతువులు, పశువుల మాంసం తిన్నాకూడా మనుషులకు వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది. కుక్కలు తది తరాల మలమూత్రాల వల్ల కూడా వ్యాధులు సంక్రమిస్తాయి. కుక్కలు, పిల్లులను ఒడిలో, సోఫాల్లో, మంచాల్లో కూర్చుండబెట్టినప్పుడు దుస్తుల ద్వారా బ్యాక్టీరియా, వైరస్ వ్యాపిస్తుంది. అన్ని వ్యాధుల్లోనూ రేబిస్ అత్యం త ప్రమాదకరమని వైద్యులు అంటున్నారు. పిచ్చి కుక్కలు మనుషులను, గేదెలను కరవటం పరిపాటిగా మారగా వీటిని నిర్మూలించేలా, వీధి కుక్కలకు సైతం వ్యాక్సినేషన్ చేయాల్సి ఉంటుంది.



అవగాహన అవసరం..

మూగజీవాల పెంపకంలో అవగాహనతో పాటు అప్రమత్తత ఎంతో అవసరం. మనం ఎంతో అభిమానంగా పెంచుకునే కుక్కల నుంచి ర్యాబిస్, గజ్జి, పశువుల నుంచి, గొర్రెలు, మేకల వంటి గడ్డి తినే జంతువుల నుంచి ఆంత్రాక్స్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వ్యాధుల లక్షణాలు గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించి సూచనలు తీసుకోవాలి.

- డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

వ్యాక్సినేషన్ చేయించాలి..



ఇంట్లో పెంచుకునే జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలి. లేకపోతే జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్ర మించే ప్రమాదం పొంచి ఉంది. ఈ వ్యాధులు వ్యాప్తి చెం దకుండా ఉండా లంటూ రెగ్యులర్ వెటర్నరీ వైద్యుల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు పాటించాలి.

- కందుకూరి పూర్ణచందర్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్

● ఇవి పాటిస్తే మేలు..

వ్యాధుల బారిన పడకుండా జగ్రాత్తలు పాటించాలి. కుక్కలను ఉంచే గదులు, కట్టివేసే ప్రాంతాలను సైతం శుభ్రంగా ఉంచాలి. పిల్లలు కుక్క లతో ఆడుకున్న వెంటనే స్నానం చేయించాలి పెంపుడు కుక్కలకు ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరి గా టీకాలు వేయించాలి. పశు వైద్యులు, సిబ్బందిని సంప్రదించి వివరాలను తెలుసుకొని జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమాన్‌పూర్, జూలై 5: మండలంలోని గుండారం సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాజేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మాజీ ఎంపీటీసీకి సన్మానం

కమాన్‌పూర్, జూలై 5 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం జూలపల్లి-1 మాజీ ఎంపీటీసీ శేవ్వా శంకరయ్యను కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'మంత్రిని విమర్శించే హక్కు లేదు'

మంథని, జూలై 5: పుట్ట మధుకు మంత్రి శ్రీధర్ బాబును విమర్శించే హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీలు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కూలిన ఓడేడు గర్డర్లపై జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు చేస్తున్న వ్యాఖ్యలను వారు ఖండించారు. ముత్తారం మండల మహిళా అధ్యక్షురాలు గోవిందుల పద్మాఆనంద్,కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రెజ్లింగ్ క్రీడా ఎంపిక పోటీలు

జూలపల్లి, జూలై 5 : మండల కేంద్రంలో జిల్లా మ్యాట్ రెజ్లింగ్ ఆధ్వర్యంలో ఈనెల7న రెజ్లింగ్ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యుడు కొమ్ము సతీష్ తెలిపారు. అండర్ 23 స్త్రీ,పురుషుల ఫ్రీ స్టైల్ గ్రీకోరోమన్ విభాగంలో క్రీడల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీజేవైఎం నాయకుల అరెస్టు

ఎలిగేడు, జూలై 5: మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన బీజేవైఎం నాయకులు రాయపాక మనోహర్‌ను పోలీస్‌లు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్‌లో జరుగనున్న నిరుద్యోగుల మహాధర్నాకు వెళ్తారనే ముందస్తు అదుపులోకి తీసుకున్నారు.

ఖిలావనపర్తిలో పోలీసుల 'పల్లె నిద్ర'

ధర్మారం, జూలై 5: మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలో గురువారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ పల్లె నిద్రలో పెద్దపల్లి సీఐ కృష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నిషేధిత వాటిని ఉపయోగించకూడదని, యువత మంచి సత్ప్రవర్తనతో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మారం ఎస్సై శీలం లక్ష్మణ్, పోలీసులు పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌కు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, జూలై 5: సింగిల్ విండో సొసైటీ రాష్ట్రంలోనే ఉత్తమ సొసైటీగా ప్రభుత్వం గుర్తించి కో-ఆపరేటివ్ ఎక్సలెన్స్ మెరిట్ అవార్డు రావడం పట్ల శుక్రవారం సింగిల్ విండో చైర్మన్ రామచంద్రారెడ్డితో పాటు సీఈవో కోలేటి శ్రీనివాస్‌ను మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి సొసైటీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది ఎర్రబాటి రవి, శ్రీనివాస్, శ్రావణ్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

ఓదెల, జూలై 5 : మండల కేంద్రంలో శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం గ్రామ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామ ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా నూతి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నాగుల మల్యాల రమేష్‌చారి, ప్రధాన కార్యదర్శిగా తాడికొండ వెంకటేశ్వర్లు, కోశాధికారిగా నాగుల మల్యాల లక్ష్మణచారి ఎన్నిక కాగా, సంఘానికి సలహాదారులుగా పోలోజు రమేష్, బ్రాహ్మడ్లపల్లి భీమయ్య ను నియమించారు.

దివంగత మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళి

కాల్వశ్రీరాంపూర్, జూలై 5: మూలకున్న కాల్వ శ్రీరాంపూర్‌ను పట్నం చేసిన ఘనత దివంగత మాజీ ఎమ్మెల్యే కాల్వ రామచంద్రారెడ్డికి దక్కుతుందని సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి అన్నారు. సింగిల్‌విండో సొసైటీకి భూదానం చేసిన కాల్వ రామచంద్రారెడ్డి కుమారులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాల్వ రామచంద్రారెడ్డి సేవలను చదువు రామచంద్రారెడ్డి కొనియాడారు. 1992లో అనారోగ్యంతో మృతిచెందిన కాల్వ రామచంద్రారెడ్డిని ఇప్పటికే ప్రజలు గుర్తు చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో కాల్వ రాజప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అశోకరెడ్డి, కాల్వ ప్రభాకర్‌రెడ్డి, సీఈవో కోలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

సుల్తానాబాద్, జూలై 5: సుల్తానాబాద్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పెన్నులు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుక్స్, పెన్నులు పంచారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్ కుటుంబానికి రెండు వేల రూపాయలను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, క్లబ్ అధ్యక్షులు అక్కినపల్లి సత్యనారయణ, ఎల్లంకి రాజన్న, రమేష్, సంపత్, భాస్కర్, పల్లా సురేష్, భూమన్న, చకిలం వెంకటేశ్, సురేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం అభివృద్ధికి సహకరించాలి

- నాలా ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించండి - ఇంటింటా చెత్త సేకరణను పూర్తి స్థాయిలో అమలు చేయాలి

- వార్డు సందర్శన కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జూలై 5: రామగుండం నగర అభివృద్ధికి ప్రజలు, అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. ప్రజల వద్దకు పాలనలో భాగంగా శుక్రవారం రామగుండం 26వ డివిజన్‌లో వార్డు సందర్శన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అడ్డగుంటపల్లి, సాదననగర్, దుర్గానగర్, మార్కండేయకాలనీ, లోకేశ్వర్‌రెడ్డి లే అవుట్ ఏరియా ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పలువురు కాలనీల వాసులు రోడ్లు, డ్రైనేజీల గురించి ఏకరువు పెట్టారు. నాలాల ఆక్రమణలు, చెట్ల పొదలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం నగర అభివృద్ధికి కన్సల్టెంట్ల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.100కోట్లు నిధులు మంజూరు చేయించామని, నగరంలో దశల వారీగా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నగరానికే తలమానికంగా ఉన్న 26వ డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని, నిధులు మంజూరు చేస్తామన్నారు. కాలువలు, రహదారుల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నాలాల్లో చెత్త వేయకుండా కట్టడి చేయాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ జరుపాలని, ప్రజలు బయట చెత్త పారేయకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే



డివిజన్ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జరిమానా విధించాలని ఆయన ఆదేశించారు. జేసీబీలు, ట్రాక్టర్లు ఉపయోగించి రోడ్లు, కాలువలు శుభ్రపరచాలన్నారు. ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు, చెట్లు తొలగించాలన్నారు. గౌతమిసాయి కళాశాల ప్రాంగణంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, తహసీల్దార్ కుమారస్వామి, ఈఈ రామన్, ట్రాన్స్‌కో ఏఈ మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మంచికట్ల దయాకర్, మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ముస్తాఫా, కోఆప్షన్ బుచ్చిరెడ్డి,మాజీ కార్పొరేటర్ దాసరి ఉమ, నాయకులు సాంబమూర్తి, దీటి బాలరాజు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తిచేయాలి

పనులను సకాలంలో పూర్తిచేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, నగరపాలక సంస్థలో కొందరు కాంట్రాక్టర్లు అధికారులను అసభ్యపద జాలంతో దూషించడమే కాకుండా బెదిరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అధికారుల జోలికి వెళితే సహించేది లేదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ కాంట్రాక్టర్లను సున్నితంగా మందలించారు. శుక్రవారం నగరపాలక కాంట్రాక్టర్లతో క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులకు నిధులు తీసుకువచ్చే బాధ్యత తనదని, పాత నిధులకు సంబంధించి పెండింగ్‌బిల్లుల గురించి సమీక్ష చేస్తానని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. కాంట్రాక్టర్లు, అధికారుల సంబంధాలు పనులు చేయించేంత వరకే ఉండాలని సూచించినట్టు తెలిసింది.

గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పర్యటన



కనగర్తి పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రత్యేక అధికారి



తుర్కలమద్దికుంటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓదెల, జూలై 5 : ప్రకృతిలో చెట్ల ప్రాముఖ్యతను తెలిపే విధంగా గ్రామాల్లో వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తి దాసరి పద్మ, హనుమయ్య హై స్కూల్లో శుక్రవారం వన మహోత్సవం ప్రారంభోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో భాస్కర్, ఏపీఎం లతామంగేశ్వరి, ప్రధానోపాధ్యాయుడు ఎర్ర రమేష్, ఇన్‌చార్జి ఏపీవో శ్వేతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దపల్లి రూరల్, జూలై 5 : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా మండలంలోని రాఘవపూర్, తుర్కలమద్దికుంట గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఇంటింటా తిరుగుతూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, మసియోద్దిన్, లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మౌళిక వసతులు కల్పించడమే లక్ష్యం

ఎలిగేడు, జూలై 5 : ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు మౌలిక వసతులు లక్ష్యంగా పనిచేస్తుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్‌డీవోపీడి)రవీందర్ అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా సుల్తాన్‌పూర్, నర్సాపూర్, శివపల్లి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన మండల స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. పలు గ్రామాల్లో జరిగిన వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. కాగా మిగతా 8గ్రామాల్లో సైతం డ్రై డే, వన మహోత్సవ కార్యక్రమాలు యదావిధిగా జరిగాయి. ఆయనతోపాటు పంచాయతీరాజ్ ఈఈ గిరీష్‌బాబు, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీఎం సుధాకర్, ఏఈపీఆర్ జగదీశ్వర్, ఏపీవో సదానందం, హెచ్‌ఎంలు గంగ్ర దేవేందర్‌రావు, నరేంద్రచారి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏవో ఉమాపతి, సీసీలు జ్యోతి, మల్లేశం, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళల భద్రతకు షీ టీమ్

కాల్వశ్రీరాంపూర్, జూలై 5: మహిళల భద్రత కోసమే షీటీమ్‌లు పని చేస్తున్నాయని కాల్వశ్రీరాంపూర్ ఏఎస్ఐ నీలిమ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు షీటీమ్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా షీటీమ్ నంబర్ 6300392370తో పాటు డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, మహిళా కానిస్టేబుల్ స్నేహలత, కానిస్టేబుల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి వైద్యం కోసం ఆర్థికసాయం

పెద్దపల్లి రూరల్, జూలై 5 : మండలంలోని కాపులపల్లి గ్రామ పంచాయితిలో పనిచేస్తున్న కార్మికుడు కమలాకర్ క్యాన్సర్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా గ్రామస్థులు అంతా కలిసి రూ. 40 వేలు ఆర్థికసాయం అందించారు. గ్రామంలో ఎవరికి ఆపద వచ్చిన గ్రామ వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం అందించి ఎంతో కొంతమొత్తాన్ని జమ చేసి ఆపదలో అందిస్తున్నారు. వారు చేస్తున్న ఉదారత పట్ల పలు గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు. నగదు అందించిన వారిలో గోపు శ్రీనివాస్, నల్లవెల్లి అశోక్‌తో పాటు గ్రామస్థులు ఉన్నారు.

చీకురాయి రైల్వే గేట్ మూసివేత

పెద్దపల్లి రూరల్, జూలై 5 : మండలంలోని చీకురాయి రైల్వే గేట్ శుక్రవారం నుంచి ఈనెల 8 వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కొలనూర్ నుంచి చీకురాయి మధ్య రైల్వే ట్రాక్‌లలో అత్యవసర మరమ్మతుల పనులను చేపడుతున్నామని ఈసందర్భంగా చీకురాయి రైల్వేగేటును మూసివేయనున్నట్లు, కావునా వాహనదారులు, గ్రామాల ప్రజలు సహకరించాలని రైల్వే అధికారులు ప్రకటనలో కోరారు.

ప్రత్యేక అధికారిగా బాధ్యతల స్వీకరణ

ధర్మారం, జూలై 5: ధర్మారం మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఏ. ప్రేమ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన ప్రేమ్‌కుమార్‌కు మండల పరిషత్ అధికారులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రమేష్ ఉన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కోల్‌సిటీ, జూలై 5: నూతన చట్టాల అమలును నిరసిస్తూ శుక్రవారం గోదావరిఖని కోర్టుల్లో విధులను న్యాయవాదులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. నూతన చట్టాలు సామాన్యుడికి వ్యతిరేకంగా ఉన్నాయని, వాటిని రద్దు చేసి కొత్త చట్టాలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తౌటం సతీష్, జవ్వాజి శ్రీనివాస్, ప్రతినిధులు రాంటెంకి శ్రీనివాస్, సత్యనారాయణ, సంజయ్, నడిపెల్లి కిషన్‌రావు, మేడ చక్ర పాణి, శీతకారి చంద్రశేఖర్, ఆరె మధు, వరలక్ష్మి, బోయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

ముత్తారం, జూలై 5: వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీలు కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో 75వ వన మహోత్సవ కార్యక్రమాన్ని వారు ఎంపీడీవో లలిత, అధికారులతో కలిసి నిర్వహించారు. మండల అధ్యక్షురాలు గోవిందుల పద్మఆనంద్, నాయకులు తూటి రఫీ, రాపల్లి రామన్న, గాదం శ్రీనివాస్, అనుము సమ్మయ్య, కోల విజయ్, బుచ్చాంరావు, జితేందర్ యాదవ్ పాల్గొన్నారు.

గుంతలమయమైన రోడ్డు

సుల్తానాబాద్, జూలై 5: మండలంలోని తొగర్రాయికి వెళ్ళే రోడ్డు గుంతలతో ఉండి పాదచారులకు అసౌకర్యంగా ఉంది. కనుకుల-తొగర్రాయి గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డులో గుంతలు ఏర్పడి వర్షం నీరు చేరడంతో వాహనాల రాకపోకల సందర్భంలో పాదచారులు గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకుర్తి, జూలై 5: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేయడంతో పాటు వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ. ట్రాఫిక్ పరంగా ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ప్రతీ వాహనదారుడు చూడాలన్నారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పాలకుర్తి, జూలై 5: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో పొల్సాని శశికళ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలం పరిధిలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో అమె సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో సందర్శించి పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. అందులో భాగంగా జయ్యారంలో కార్యదర్శి తిరుపతి పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు జంగిలి రజిత, ఆవులం శోభారాణి, ఆశావర్కర్ అండకొండ పద్మ తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరుగుతు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇంటిపరిసర ప్రాంతాల్లో మురికి నీరు నిలువకుండా చూడాలని పిలుపు నిచ్చారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి



రాంనగర్‌లో మొక్క నాటుతున్న కందుల సంధ్యారాణి

కోల్‌సిటీటౌన్, జూలై 5: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి, జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదావరిఖనిలోని రాంనగర్, మార్కండేయకాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటి మాట్లాడారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు అమ్మ కోసం ఒక మొక్క కార్యక్రమం విజయవంతంగా కొనసాగిస్తున్నామని, అందుకు సహకారాన్ని అందిస్తున్న ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఓబీసీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు పిడుగు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్యాతం వెంకటరమణ, జక్కుల నరహరి, గుండెబోయిన భూమయ్య, పెద్దపల్లి రవీందర్, సుల్వ లక్ష్మీనర్సయ్య, మహవాది రామన్న, శ్రీను, బూడిద రమేష్, సుధాకర్, కుంబాల రాజు, స్వామి, వీరేశం, రాజ్‌కుమార్, సురేష్, మహేష్, కనకయ్య, రాజేశం పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు



విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్, జూలై 5: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తే అద్భుతాలు సృష్టిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అల్ఫోర్స్ స్కూల్‌లో నూతనంగా ఎన్నికైన హస్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు నిష్ణాణుతులైన అధ్యాపకులతో విద్యా బోధనలు చేయిస్తున్నామన్నారు. మరోవైపు క్రీడారంగంలో ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

రేపటి నుంచి ఇంటర్ రీజియన్ స్పోర్ట్స్ మీట్

జ్యోతినగర్, జూలై 5: రామగుండం ఎన్‌టీపీసీ మహాత్మాగాంధీ స్టేడియంలో ఆదివారం నుంచి ఈనెల 10 వరకు ఇంటర్ రీజియన్ స్పోర్ట్స్ మీట్ (దక్షిణ) నిర్వహించనున్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్ ఈవెంట్‌లలో జరిగే ఈ టోర్నమెంట్‌లో ఎన్‌టీపీసీకి చెందిన దక్షిణ రీజియన్‌లోని రామగుండం ఎన్‌టీపీసీ, సింహాద్రి ఎన్‌టీపీసీ (విశాఖపట్నం), కుడిగి ఎన్‌టీపీసీ (కర్ణాటక), కాయం కులం ఎన్‌టీపీసీ (కేరళ), వల్లూర్ ఎన్‌టీపీసీ (తమిళనాడు) జట్లు పాల్గొంటున్నాయి.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

- డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్

జూలపల్లి, జూలై 5: ప్రజలకు సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా మండలంలోని అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకంగా కృషిచేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్ అన్నారు. స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా జూలపల్లి మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వాహణను పరిశీలించిన ఆయన గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం పెద్దాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి పున్నమయ్యపై వచ్చిన నిధుల దుర్వినియోగంపై విచారణ నిర్వహించారు. కాగా నాగులపల్లి జూనియర్ పంచాయతీ కార్యదర్శి సంపత్‌కుమార్ తన ప్రొబేషనరీ పీరియడ్‌ను పూర్తిచేసుకున్న సందర్భంగా సదరు ఉద్యోగిని క్రమబద్ధీకరిస్తూ ప్రక్రియను పూర్తిచేసేందుకు నిర్ణయించారు. అనంతరం గ్రామంలోని పంచాయతీ వనరులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శులు అనంతుల లచ్చయ్య, పున్నమయ్య, సంపత్‌కుమార్, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పలువురు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి ఘన సన్మానం

సుల్తానాబాద్, జూలై 5: సుల్తానాబాద్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడిగా బాలాజీరావు ఐదేళ్లు పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేశారని కొదురుపాక గ్రామస్థులు కొనియాడారు. ఎంపీపీ బాలాజీరావు పదవీకాలం గురువారంతో పూర్తయినందున శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడుతు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అఖిల, మాజీ ఎంపీటీసీ ఉత్తమకుమారి, నాయకులు నరేష్, రాయమల్లు, శ్రీను, కృష్ణ, ఆసిస్, ఆశావర్కర్లు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామస్థులు ఉన్నారు.

ఖని పీజీ కళాశాలలో వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కోల్‌సిటీటౌన్, జూలై 5: గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ విభాగంలో ఫేర్‌వెల్ డే హంగామా శుక్రవారం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు నిర్ధేశించుకున్న లక్ష్యాన్ని సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సీనియర్ విద్యార్థులకు జూనియర్లు ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు హుషారెత్తించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రవి, ప్రసాద్, సావిత్రి, సల్మాసుల్తానాఅజీజ్, రమేష్‌రెడ్డి, అజయ్‌కుమార్, యాదయ్య, ఎంకామ్, ఎంబీఏ, ఎంఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఓసీపీ-3లో ఘనంగా బోనాల జాతర



బోనంతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 5: ఓసీపీ-3 ప్రాజెక్టులో శుక్రవారం బోనాల జాతర అత్యంత వైభవంగా జరిగింది. డప్పు చప్పుళ్ళు పోతరాజుల వేషాలతో కృషిభవన్ ప్రాంగణం హోరెత్తింది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఆయన సతీమణి మనాలీఠాగూర్‌లు బోనం ఎత్తుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులకు శాలువాతో సత్కరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో జీఎం సూర్యనారాయణ, పీవో మధుసూదన్‌తో పాటు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓసీపీ-3లో ఆలయ నిర్మాణానికి రిటైర్ కార్మికుడి విరాళం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 5: ఓసీపీ-3 ప్రాజెక్టులో మైసమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రిటైర్ కార్మికుడు బేతి చంద్రయ్య తన నెల పెన్షన్ మొత్తాన్ని విరాళంగా అందజేశాడు. శుక్రవారం జరిగిన అమ్మవారి బోనాల జాతరలో ప్రాజెక్టు అధికారి మధుసూదన్‌కు రూ.25116 అందజేశాడు. గతంలో ఓసీపీ-3లో ఈపీ టపరేటర్‌గా పనిచేస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా ఉద్యోగ విరమణ చేసిన బేతి చంద్రయ్య ఔదార్యానికి కార్మికులు అభినందించారు.

శ్రీరాంపూర్ కేంద్రంగా బీఎంఎస్ మహాసభలు

- హాజరవుతున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ - యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

గోదావరిఖని, జూలై 5: సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) 28వ ద్వైపాక్షిక మహాసభలు ఈనెల 14న శ్రీరాంపూర్ ఏరియాలో జరుగుతాయని ఆ యూనియన్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య తెలిపారు. ఈ మహాసభలకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సత్తయ్య మాట్లాడారు. ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఈ సభలను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ మహాసభల్లో జేబీసీసీఐ సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి, ఏబీకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుధీర్, బీఎంఎస్ తెలంగాణ స్టేట్ కార్యదర్శి రాంరెడ్డి పాల్గొంటారని ఆయన చెప్పారు. పరిశ్రమల పరిరక్షణ, కార్మికుల సంరక్షణ కొరకు ఈ సభల్లో చర్చ జరుగుతుందన్నారు. నూతన బొగ్గు గనుల ఏర్పాటు, ఆదాయపన్ను రీయింబర్స్‌మెంట్, సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయడం కోసం కూడా ఈ మహాసభలు తీర్మానాలు చేస్తాయన్నారు. సింగరేణి వ్యాప్తంగా ప్రతి రీజియన్‌లో సూపర్ సెషాలిటీ వైద్య సేవలు అందించాలని, మెరుగైన విద్య కొరకు కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో సింగరేణిని డిమాండ్ చేస్తామన్నారు. సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.28వేల కోట్ల విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని అంశం మీద కూడా మహా సభలు చర్చిస్తాయన్నారు. సింగరేణి రక్షణ కమిటీలలో జాతీయ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

సంఘాల సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించాలని, శుద్ధమైన నీటిని కార్మిక కుటుంబాలకు అందించాలని, సంస్థలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఈ మహాసభలు బీఎంఎస్ బలోపేతంతో పాటు సింగరేణి కార్మికుల హక్కులు, సింగరేణి సంస్థ భవిష్యత్‌పై కూడా సుదీర్ఘంగా చర్చలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఆకుల హరిణ్, సాయవేని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వోల్వో ఆపరేటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 5: సింగరేణి ఆర్జీ-2 యాజమాన్యం వాల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జీఎం సూర్యనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. పరిసర ప్రభావిత గ్రామాల నిరుద్యోగ యువకులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. 18 నుండి 35 ఏళ్ళ మధ్య వయస్సు యువకులు పదవ తరగతి ఉత్తీర్ణత, హెవీ గూడ్స్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి డ్రైవింగ్‌లో మూడేళ్ళ అనుభవం ఉన్న వారు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వయోపరిమితి సడలింపులో ప్రభుత్వ నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోపు ఆర్జీ-2 ఎంవీటీసీ కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని జీఎం సూచించారు. జూలై 15 నుండి శిక్షణ ప్రారంభం కానున్నట్టు జీఎం సూర్యనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

శ్రీరాంపూర్, జూలై 5: సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను వేలంవేయవద్దని డిమాండ్ చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టనున్నట్లు టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఒకప్రకటనలో తెలిపారు. అనంతరం జీఎంకు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.